
ప్రజాశక్తి
ఆదివారం 16 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం



గురుకులాన్ని సందర్శించిన సిటీయు విసి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలుర గురుకుల కళాశాలను సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ టివి కట్టమని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చదువు స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ పూర్తయిన తర్వాత ఏం చేయాలని డిగ్రీ తర్వాత ఏం చేయాలని కెరియర్ గైడెన్స్ ఇచ్చారు. అదేవిధంగా సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో ఏ కోర్సులు ఉన్నాయి. ఎలా అప్లై చేయాలి అన్న దానిపై అవగాహన కల్పించారు. దానివల్ల ఉపయోగాలను వివరించారు. విద్యార్థులకు ఉద్యోగాలు, కాంపిటేటివ్ గురించి వివరించారు. ఆయనతో పాటు పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పడాల భూదేవి, ప్రిన్సిపల్ జి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సులు, గిరిబజార్ ప్రారంభం

ప్రజాశక్తి - సాలూరు

జిల్లాకు మంజూరైన ఐదు అంబులెన్స్‌లను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం ప్రారంభించారు. అంబులెన్స్‌లతో పాటు గిరిజనులకు దగ్గరలో నిత్యావసర వస్తువులు అందుబాటులో తెచ్చేందుకు ఏర్పాటు చేసిన గిరి బజార్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజనులకు ఎటువంటి కష్ట నష్టాలు జరగకుండా అంబులెన్స్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు. సంతల్లో వివిధ రకాల కల్తీ బారిన గిరిజనులు పడకుండా నాణ్యమైన సరుకులు లభించేలా గిరి బజార్ ఏర్పాటు చేశామని తెలిపారు. గిరిబజార్లో అన్ని నిత్యవసర సామగ్రి అందుబాటులో ఉంటుందని, సరసమైన ధరలు లభిస్తాయని ఆమె చెప్పారు. సామాజిక కార్యక్రమంలో భాగంగా అంబులెన్స్‌లను అందించిన సంస్థను ఆమె అభినందించారు. సాలూరు పాటు మిగిలిన ప్రాంతాల్లో అంబులెన్స్‌లు సేవలను అందిస్తాయని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా గిరి బజారులో సామాగ్రిని మంత్రితో పాటు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు కొనుగోలు చేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

పదో తరగతి పరీక్షలు రాస్తున్న స్థానిక ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థులకు సామాగ్రిని మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా బాగా చదువుకొని పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. త్వరలో అన్ని బాలికల ఆశ్రమం పాఠశాలలో వేడి నీరు సరఫరా జరిగేలా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, ఎపిడి వై.సత్యంనాయుడు, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆర్.కృష్ణవేణి, జిసిసి డిఎం యు.మహేంద్ర కుమార్, ఐసిడిఎస్ పీడీ డాక్టర్ టి.కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఘనంగా మంత్రి సంధ్యారాణి జన్మదిన వేడుకలు

రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆమె నివాసం లో కుటుంబ సభ్యులతో కలిసి బర్త్ డే కేక్ కట్ చేశారు. అనంతరం కలెక్టర్ శ్యాం ప్రసాద్‌తో పాటు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ్, ఇతర జిల్లా అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. క్యాంప్ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తల సందడి కనిపించింది.

జిల్లా సమగ్రాభివృద్దే లక్ష్యం

జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా సమగ్రాభివృద్దే లక్ష్యం కావాలని జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ నారాయణ భరత్ గుప్తా పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ప్రత్యేక అధికారి కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్వర్ణాంధ్రా దిశగా అభివృద్ధి సాధన లక్ష్యంగా అడుగులు వేస్తుందని, కావున ఈ జిల్లా సైతం అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని చెప్పారు. ప్రతి రంగంలో అభివృద్ధి కనబడాలన్నారు. విజన్ డాక్యుమెంట్ మేరకు కనీసం 15 శాతం అభివృద్ధి సాధించాలని, అందుకు తగిన విధంగా కార్యాచరణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రాథమిక రంగాల అభివృద్ధికి అవకాశం ఎక్కువగా ఉందన్నారు. భూమి, నీటి వనరులు సక్రమంగా వినియోగించుకోవడం వల్ల లక్ష్య సాధనకు అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలన్నారు. సంబంధిత నివేదికలను పూర్తిస్థాయిలో సమర్పించాలన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమం ఆవిష్కృతానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని అన్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, డిఎఫ్ఒ జిఎపి ప్రసూన, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి నారాయణ భరత్ గుప్తా

ప్రత్యేక అధికారి గుప్తాను కలిసిన కలెక్టర్, ఎస్‌పి

జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించిన డాక్టర్ నారాయణ భరత్ గుప్తా శనివారం పార్వతీపురం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. అనంతరం జిల్లాకు సంబంధించిన పలు విషయాలు చర్చించారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.



సమ్మె విరమణ పత్రాన్ని యూనియన్ నాయకులకు అందజేస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్ ప్రసాద్

సమస్యలు పరిష్కరిస్తాం : ఇన్‌ఛార్జి కమిషనర్

సమ్మె విరమించిన మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఆరు రోజులుగా స్థానిక మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె బాట పట్టారు. ఎట్టకేలకు శనివారం స్థానిక మున్సిపల్ ఇన్‌ఛార్జి ప్రసాదు, మేనేజర్ శివప్రసాదు, టిపిఒ ఝాన్సీ, శానిటేషన్ ఇన్స్పెక్టర్ రాజీవ్ సమ్మె శిబిరం వద్దకు వచ్చి చర్చలు నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి కమిషనర్ మాట్లాడుతూ ఫిబ్రవరి, మార్చి నెలల జీతాలు ఏప్రిల్ 15 లోపు కార్మికుల ఖాతాల్లో జమ చేసేలా బాధ్యత పడతామని, ఏప్రిల్, మే జీతాలకు బడ్జెట్ వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే సమ్మె కాలాన్ని క్యాజువల్ లీవ్, బదిలీ రోజులు పని చేసేలా కార్మికుల నష్టపోకుండా సహకరిస్తామని తెలిపారు. టిడిపిఒ, మేనేజర్,శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కూడా కార్మిక సమస్యల పరిష్కారంలో ఇకపై నిర్లక్ష్యంగా ఉండమని, యూనియన్ కూడా సహకరించాలని కోరారు. ఈ మేరకు యూనియన్ కార్యదర్శి ఎన్వై నాయుడు, సాలూరు కమిటీ అధ్యక్షుడు కార్యదర్శులు రాముడు, శంకర్రావు మీడియా ఇంచార్జ్ రవి, మహిళా నాయకులు సీత, దేవి మాట్లాడుతూ అధికారుల హామీ మేరకు సమ్మెను విరమిస్తున్నామన్నారు. హామీని అమలు చేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ మద్దతు

స్థానిక మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆరు రోజులుగా చేపట్టిన సమ్మెకు నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కర్త గేదెల రామకృష్ణ శనివారం మద్దతు తెలిపారు. గత ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలని డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్మికుల సమ్మె శిబిరం వద్దకు వెళ్లి కాంగ్రెస్ ఒబిసి జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు కలిసి వెళ్లి రామకృష్ణ మద్దతు పలికారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రంలో పారిశుధ్య కార్మికులకు జీతాలు సకాలంలో అందక ఇబ్బందులు ఎదుర్కోవడం దారుణమని అన్నారు. ప్రతి నెలా కార్మికులకు జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. శనివారం జరిగిన పరీక్షకు 207 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ త్రినాధ తెలిపారు.

తుమరాడలో దాహం కేకలు

- ఖాళీ బిందెలతో నిరసన తెలిపిన మహిళలు
- రెండు నెలలుగా తాగునీరందని పరిస్థితి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని తుమరాడలో రెండు నెలలుగా తాగడానికి నీళ్ల లేక అల్లాడుతున్న గ్రామస్తులు సిపిఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో గ్రామంలో ర్యాలీ. సచివాలయం దగ్గర ధర్నా శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు యమ్మల మన్మథరావు మాట్లాడుతూ రెండు నెలలుగా తాగడానికి మంచినీళ్లు లేక తుమరాడ గ్రామస్తులు అల్లాడిపోతున్నారన్నారు. ఎండాకాలం వచ్చింది తాగడానికి నీళ్ల లేక తమ బంధువులను పిలవడానికి ఇబ్బంది పడుతున్నామన్నారు. రెండు నెలల నుంచి నీళ్ల రావడం లేదని, ఇంటింటికి కుళాయిలు వేస్తామని చెప్పినా, ఇప్పటికీ వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులను అడిగితే చూద్దాం చేద్దాం అంటున్నారే తప్ప తాగడానికి నీళ్ల ఇవ్వడం లేదన్నారు. తప్పని పరిస్థితుల్లో మంచినీళ్ల కోసం ర్యాలీగా వచ్చి సచివాలయం దగ్గర ధర్నా చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ రెండు రోజుల్లో మంచినీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఒకవేళ సమస్య పరిష్కరించకపోతే ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మహిళలు, సిపిఎం నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామ మహిళలు పాల్గొన్నారు



తమురాడ సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు



జియ్యమ్మవలస ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

గుమ్మలక్ష్మీపురం : తాగునీటి సరఫరా సరిగ్గా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని జియమ్మవలస మండల వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో తాగునీరందించాలని ఖాళీ బిందెలతో మహిళలు ధర్నా చేశారు. సమస్యను విన్న ఆర్డబ్ల్యూఎస్ అధికారులు రెండు రోజుల్లో తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.సీతారాం, నాయకులు మోహన్‌రావు, శాంతమ్మ, రజిని ఉన్నారు.

మూడు అంబులెన్సులు అందించిన ఎన్‌పిసిఐ

ప్రజాశక్తి - పార్వతీపురం

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) జిల్లాకు మూడు అంబులెన్స్‌లు అందించింది. ఈ అంబులన్స్‌లను సాలూరు లో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రారంభించగా, పార్వతీపురంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రతో కలసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా - కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ రవి కామత్, అసోసియేట్ డైరెక్టర్ కెవిఎస్ బివి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎస్.కృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో జయంతిని నిర్వహించన్నామని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్లకోమా ముగింపు వారోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కంటి ఒత్తిడి నుంచి చూపు కాపాడుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ప్రపంచ గ్లకోమా ముగింపు వారోత్సవాలు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నీటి కాసుల వ్యాధిపై అవగాహన సదస్సులు, స్క్రీనింగ్ పరీక్షలు, ర్యాలీలు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి పర్యవేక్షణలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ల నేత్ర వైద్య సహాయకులు ద్వారా నిర్వహించి ప్రజలకు ఈ వ్యాధిపై తగు సలహాలు, సూచనలు ఇచ్చి కంటి చూపు కాపాడుకొనే బాధ్యత నిర్వహించారు. ఈ సందర్భంగా చేసిన నేత్ర పరీక్షలు చేసి గ్లకోమా ఉన్న వారిని గుర్తించి ప్రాథమిక దశలో ఉన్నవారికి చికిత్సలు చేసి మందులు అందించారు. తీవ్రత దశ ఉన్నవారికి సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రులకు పంపించి ఉన్నత శ్రేణి చికిత్సలు, శస్త్ర చికిత్సలతో వారి కంటిచూపును కాపాడే బాధ్యత జిల్లా అంధత్వ నివారణ సంస్థ చేపడుతుందని డిఎంహెచ్ఒ తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నేత్ర వైద్య విభాగం కంటి వైద్య నిపుణులు డాక్టర్ శ్యామల అధ్వర్యంలో నిర్వహించి ఈ కార్యక్రమంలో రోగులకు ఈ వ్యాధి పై అవగాహన కల్పించారు. కంటి వైద్య నిపుణులు డా వెంకటేష్ రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్టోమెట్రిస్ట్ స్వాతి, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటిస్తున్న వైస్ ఎంపిపి

ఇదేం సర్వసభ్య సమావేశం?

సర్పంచులకు, ఎంపిటిసిలకు కనీస సమాచారం ఇవ్వనందుకు వాకౌట్

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బొంగు సురేష్ అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వైసిపి ఎంపీటీసీ సభ్యుల వాకౌట్‌తో ప్రారంభమైంది. ప్రజలచే ఎన్నుకోబడ్డ ఎంపిటిసి సభ్యులమైన తమకు మండల పరిషత్‌లో జరుగుతున్న పనుల విషయంలో నామమాత్రానికైనా సమాచారం ఇవ్వడం లేదని మండల పరిషత్‌కు వచ్చిన నిధులు విషయంలోనూ, చేస్తున్న అభివద్ధి పనుల తీర్మానాల్లోనూ మా సంతకాలు ఫోర్జరీ చేసి ఎవరో అనామకులకు చెప్పిన పనులు చేస్తున్నారని అన్నారు. అందుకే ఈ మండల సర్వసభ్య సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నామని వైసిపి నాయకులు, వైస్ ఎంపిపి గుడివాడ సంపత్‌కుమార్‌తో కూడిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వాకౌట్ చేశారు. అధికారులు కూటమి నాయకులు ఒక్కటై ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి వారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఆ తర్వాత మిగిలిన సభ్యులతో పలు శాఖలపై చర్చ జరిపి సమస్యలు రానీయకుండా చూడాలని అధికారులకు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ పార్థసారధి, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

జీడి ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

జీడి ప్రాసెసింగ్ సెంటర్లు వెంటనే ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాల్లో ఉన్న అనేక సమస్యలు పరిష్కారం చేయాలని ఎపి ఆదివాసి గిరిజన సంఘం నాయకులు హెచ్.రామారావు అన్నారు. ఈనెల 17, 18 తేదీల్లో ఐటిడిఎ వద్ద 48 గంటల ధర్నా జయప్రదం చేయాలని కోరుతూ ధర్నాకు సంబంధించిన కడపత్రాలు పంచుతూ శనివారం కోనవలస, పెళ్లిగుడ్డి, తమ్మన్నదొరవలస, డంగభద్ర, నందాపురం గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం, సాలూరు మండలాల్లో జీడి పిక్కల ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేసి గిరిజను పండించిన జీడి పంటతో పాటు ఇతర పంటలకు గిట్టు ధర కల్పించేలా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని కోరారు. నిరుపేదలకు ఇళ్ల స్థలంతో పాటు ఇళ్లు ఇవ్వాలని ఈ విధంగా గిరిజనులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి అన్ని విధాలా భరోసా కల్పించాలని కోరుతూ ఈనెల 17, 18 తేదీల్లో 48 గంటల పాటు పార్వతీపురం ఐటిడిఎ వద్ద చేపట్టనున్న ధర్నాలో గిరిజనులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే కొత్తవలసలో గిరిజన రైతుల జీడి తోట కాలిపోయిన సందర్భంగా పరిశీలించి నష్ట పరిహారం ఇవ్వాలని, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతులు, మహిళలు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : జీడి పంటకు మద్దతు ధరలు ఇవ్వాలని, ప్రభుత్వం జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17 18 తేదీల్లో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరిగే ఐటిడిఎ ధర్నాలో గిరిజన రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గెమ్మెల జానకిరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని జిల్లేడువలసలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా నాయకులు ఎన్వై నాయుడు, గిరిజన రైతులు కూనేటి సుబ్బయ్య, గెమ్మెల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న నాయకులు

గుమ్మలక్ష్మీపురం : జీడి పిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జీడి మామిడి రైతుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని ఇరిడి సచివాలయం వ్యవసాయ శాఖ అధికారికి వినతిని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాద్ ఆరిక నవీన్, జల్లి సతీష్, జీడి మామిడి రైతుల బి.రామ్మూర్తి, సత్తిమ్మ, సుశీల, రాధ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేయాలి

సీతానగరం: జీడి పిక్కలను రైతు సేవా కేంద్రాల ద్వారా 80 కేజీల బస్తా రూ.16 వేలకు రూపాయలకు కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు స్థానిక తహశీల్దార్‌కు శనివారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల నుండి జీడిపిక్కలు కొనకుండా వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలేసిందన్నారు. ఫలితంగా గిరిజనులు దోపిడీకి గురవుతున్నారన్నారు. కావున రైతు సేవా కేంద్రాల ద్వారా 80 కేజీల జీడిపిక్కల బస్తా రూ.16వేలకు కొనుగోలు చేయాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో రైతు సంఘం నాయకులు బొరపరెడ్డి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, చందనపల్లి కృష్ణ, జి. వెంకటరమణ పాల్గొన్నారు.

18న వాహనాల వేలం పాట

ప్రజాశక్తి - సాలూరు

వివిధ ఎక్సైజ్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మూడు వాహనాలను ఈనెల 18న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సిఐ జి.దాసు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో రెండు మోటార్ సైకిళ్ళు,ఒక ఆటో వేలం వేయనున్నట్లు చెప్పారు.ఆసక్తి కలిగిన వారు ఈ వేలం పాటలో పాల్గొనవచ్చు నని సిఐ దాసు కోరారు.

పశువులకు ఉన్న విలువ మనుషులకు లేదా?



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పశువులు కావాలి. కానీ, అదే పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించే మనుషులు అక్కర్లేదు. పాలు కావాలి. అందుకోసం పశువులను మేపాలి. కానీ, ఆ పశు పోషణకు మూలాధారమైన రైతులు మాత్రం అక్కర్లేదు. అచ్చంగా ఇలాగే ఉంది మన జిల్లాలోని ఓ సంఘటన ఆధారంగా కూటమి ప్రభుత్వ పాలన తీరు. దీన్ని బట్టి పశువులకు ఇచ్చిన విలువ.. వాటి పోషణ, వైద్యారోగ్యం చూస్తున్న మనుషులకు ఇవ్వడం లేదన్న స్పష్టంగా అర్థమౌతోందని జనం అంటున్నారు. మన జిల్లాలో స్వర్ణాంధ్రలో భాగంగా పశువులు, కోళ్ల, గొర్రెలు, మేకలు వంటి పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆ రంగంలో ఆర్థికాభివృద్ధి పెంచుతామని ప్రణాళిక రూపొందించారు. కానీ, మరోవైపు ఉత్తరాంధ్రలో అతిపెద్దగావున్న విశాఖ పాల డెయిరీ ఆవు పాలసేకరణకు పరిమితులు విధించింది. పాల ధరలు పెంచలేదు సరికదా తగ్గించింది. బోనస్ తగినంతగా ఇవ్వడం లేదు. పశువుల దాణా సరఫరాలో రాయితీలు అంతంతమాత్రమే. అయినా ప్రభుత్వం నోరు మెదపలేదు. దీన్నిబట్టి డెయిరీ యాజమాన్యంపై ఉన్న ప్రేమ పాడి రైతులపై లేదన్నది స్పష్టమైంది. మరోవైపు తమకు ఇంటర్న్‌షిప్ పెంచాలని డిమాండ్ చేస్తూ గరివిడిలోని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాల విద్యార్థులు నెల 15రోజులుగా నిరవధిక దీక్షలు చేస్తున్నారు. వీరంతా ఎంబిబిఎస్ మెడిసిన్, డెంటల్ విద్యార్థులతో సమానంగానే 5 సంవత్సరాల ఆరు మాసాలపాటు యుజి (అండర్ గ్రాడ్యుయేట్) పూర్తిచేయాల్సి వుంటుంది. ఇందులో చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ కాల వ్యవధిలో ఏదైనా రెండు జిల్లాల్లో ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రులు, పశు సంరక్షణా కేంద్రాలు లేదా జంత ప్రదర్శన శాలల్లో పనిచేయాల్సి వుంటుంది. అక్కడి వైద్యుల పర్యవేక్షణలో వీరంతా సేవలందిస్తారు. మిగిలిన వైద్యుల మాదిరిగా నగరాలు, పట్టణాల్లో ఉండేందుకు అవకాశం ఉండనే ఉండదు. పూర్తిగా గ్రామీణ ప్రాంతాల్లోనే సేవలు అందించాల్సిన పరిస్థితి ఉంటుందన్న విషయం వేరేగా చెప్పనక్కర్లేదు. ఇంటర్న్‌షిప్ కాల వ్యవధిలో ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు, భోజనం, వసతి నిమిత్తం 13ఏళ్ల క్రితం అప్పటి ధరలు, ఛార్జీలను బట్టి ఇంటర్న్‌షిప్ రూ.7వేలుగా నిర్ణయించారు. నాటి నుంచి నేటి వరకు అనేక సార్లు ధరలు, ఛార్జీలు, వసతి అద్దెలు పెరిగాయి. అందుకనుగుణంగా ఛార్జీలు పెంచలేదు. మనకన్నా అత్యంత వెనుకబడి ఉందన్న ఒడిశా రాష్ట్రంలో ప్రస్తుతం రూ.14వేలు చొప్పున ఇంటర్న్‌షిప్ స్కాలర్‌షిప్ చెల్లిస్తున్నారు. అత్యంత చిన్న రాష్ట్రమైన కేరళలో రూ.17వేలు, పొరుగు రాష్ట్రం తమిళనాడులో రూ.18వేలు, రాజస్థాన్‌లో 23వేలు చొప్పున చెల్లిస్తున్నారు. వాటి మాదిరిగా పెరిగిన ధరలు, ఛార్జీలు, అద్దెలను బట్టి మెడికల్ విద్యార్థులతో సమానంగా రూ.25వేలు చెల్లించాలని ఇక్కడి వెటర్నరీ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. పెరిగిన ధరలు, ఛార్జీలు, వసతి సదుపాయాలు ప్రభుత్వానికి తెలియదా? అందులోనూ సనాతన ధర్మాన్ని నెత్తుకెక్కించుకుటున్న ప్రభుత్వం ఆ ధర్మం ప్రకారం పశువుల వైద్యారోగ్యాన్ని కాపాడే తీరు ఇదేనా? దీన్ని బట్టి పశు వైద్యులకు విలువ ఇవ్వకుండా పశువులకు మాత్రమే ఇస్తున్నారన్నది వేరేగా చెప్పనక్కర్లేదు. దీన్నిబట్టి పాలకులు చెప్పున్నదొకటి, చేస్తున్నది మరొకటి అని పబ్లిక్ టాక్.

స్వచ్ఛ సుందర జిల్లానే లక్ష్యం

జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్వచ్ఛ సుందర జిల్లాగా రూపుదిద్దుకునేలా అందరి లక్ష్యం కావాలని జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ నారాయణ భరత్ గుప్తా పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ మార్కెట్ వద్ద స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, మున్సిపల్ ఛైర్ పర్సన్ బోను గౌరీశ్వరితో కలిసి ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ నిషేధం అన్న నినాదంతో అవగాహనా కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్ గుప్తా మాట్లాడుతూ వాతావరణ కాలుష్యానికి, ఆరోగ్యానికి ప్లాస్టిక్ సంచుల వినియోగం ఎంత హానికరమో ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. తమ వంతు బాధ్యతగా ఇంటి పరిశుభ్రత పాటించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి స్వచ్ఛ సుందర జిల్లాగా రూపొందించేలా అందరూ కృషి చేయాలని సూచించారు. అందరి సహకారంతో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పేర్కొన్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ భూతాన్ని తరిమివేద్దామన్నారు.ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ మళ్లీ వాడకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో భాగంగా స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర సాధనకు ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. అనంతరం ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ నిషేధం, పునర్వి నియోగం వస్తువుల వాడకంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తదితరులు, పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

పార్వతీపురంరూరల్ : స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు అధికారులు, సిబ్బంది క్యాంపు కార్యాలయం, స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణం చుట్టుపక్కల ఉన్న పరిసరాలను పరిశుభ్రం చేశారు. చుట్టుపక్కల పరిసరాల్లో వుండే చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను, పచ్చికను తొలగించి పరిశుభ్రం చేశారు. చిన్న చిన్న గుంతలును పూడ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ ఎస్ వి మాధవ్ రెడ్డి మాట్లాడుతూ మన ఇల్లు లాగానే మన కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎఎస్పి అంకిత సురాన, ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఎఆర్ ఆర్ఐలు రాంబాబు, ఆర్ఎస్ఐలు, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో...

స్థానిక కలెక్టర్ కార్యాలయ ఆవరణలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా డిఆర్ఒ కె.హేమలత మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. పనస, నేరేడు, సపోటా కోకో వంటి రకాల మొక్కలను డిఆర్ఒ చేతులమీదుగా నాటారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు రాధాకృష్ణ, ఉప తహశీల్దార్లు చంద్రమౌళి, రమణ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని పెద్దఖేర్జి గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎటిడబ్ల్యూఒ సురేష్ కుమార్ ఆధ్వర్యాన పరిసరాలను శుభ్రం చేశారు. తొలుత విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తరగతి గదులు పాఠశాల ఆవరణ పరిసరాలు పరిశుభ్రత చేయించి వారికి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, వ్యాసరచన, క్విజ్ వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ప్లాస్టిక్ వాడకం పై నిషేధిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు, వార్డెన్ సీతారాం, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆవరణలో పరిశుభ్రంగా ఉండాలని జిల్లా వైద్యాధ వైద్యాధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డిఐఒ టి.జగన్ మోహన్‌రావు, వినోద్ కుమార్, స్థానిక వైద్యాధికారులు పి.పావని, పి.ఉషారాణి, పి.లావణ్య, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : ప్లాస్టిక్ నిషేదానికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని తయారు చేయడానికి ప్రజలంతా సహకరించాలని మండలంలోని మొండెంఖల్ పిహెచ్‌సి వైద్యాధికారి బి.ప్రజ్ఞ కోరారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి ఆవరణములో గల పరిసరాలను వైద్య సిబ్బందితో కలిసి పరిశుభ్రత చేశారు. అనంతరం ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భామిని : మేజర్ పంచాయతీ బత్తిలిలో పంచాయతీ కార్యదర్శి శ్రీను ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల, ఉపాధ్యాయులు, బత్తిలి పిహెచ్ సి వైద్య సిబ్బందితో కలిసి బత్తిలి జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనార్థాలు, తడి చెత్త పొడి చెత్త సేకరణ అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం బత్తిలి వాణిజ్య సముదాయ కూడలి వద్ద మానవహారం చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బత్తిలిలో ఇటీవల యాత్ర జరిగిన ప్రాంతంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది కలిసి వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లు, చెత్తను ఏరి శ్రమదానం చేశారు. కార్యక్రమం లోకానోసా ప్రైవేట్ పాఠశాల సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


గుడ్డ సంచుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

సాలూరు:స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నీడ్ స్వచ్ఛంద సంస్థ,మెప్మా ఆధ్వర్యాన ప్రతిజ్ఞ చేశారు. ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ్ ప్రభుత్వం నిర్దేశించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు, మున్సిపల్ కమిషనర్ బివి ప్రసాద్, ఎంపిడిఒ పార్వతి పాల్గొన్నారు.


కురుపాం : స్థానిక రెవెన్యూ కార్యాలయం పరిసర ప్రాంతాలలో పరిశుభ్రత చేసి అనంతరం మొక్కను నాటారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రమణమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దాన్ని పెంచి పోషించాలని అప్పుడే పచ్చదనం అనేది ఏర్పడి పర్యావరణం, పచ్చదనం పరిరక్షణగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని బాలగొడబలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఎమ్మెల్యే విజయచంద్ర ఆధ్వర్యాన నిర్వహించారు. ఇళ్లల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి ఇంటికి వస్తున్న పారిశుద్ధ కార్మికులకు అందజేసి చెత్త నుంచి సంపదను పొందేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సీతంపేట :స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పాలకొండ నియోజకవర్గ ఇంచార్జ్ పడాల భూదేవి పిలుపునిచ్చారు. స్థానిక ఐటిఐలో విద్యార్థులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ, వి.రఘు రామ్, కేశవరావు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలం లోని పెద్దూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నెల్లి సత్యం నాయుడు, ఎస్ఎంసి చైర్మన్ చిట్టెమ్మ దివ్య ఆధ్వర్యాన నిర్వహించారు.

మక్కువ : మండల కేంద్రం లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం తహశీల్దారు షేక్ ఇబ్రహీం, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి వారి కార్యాలయాల్లో చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెవెన్యూ


కురుపాంలో మొక్కను నాటి నీరు పోస్తున్న తహశీల్దార్ రమణమ్మ


భామినిలో విద్యార్థులు చేపట్టిన మానవహారం

'ఆ పనులకు చెల్లింపులు కాలేదు'

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో ఉపాధిహామీ ఫారం పాండ్ పనులకు, ఇంకుడు గుంతలకు యంత్రాలు వినియోగించిన వాటికి ఏ విధమైన చెల్లింపులు చేపట్టలేదని ఎంపిడిఒ డిడి స్వరూపరాణి తెలిపారు. శనివారం 'ప్రజాశక్తి'లో యంత్రాలతో ఉపాధి పనులు కథనంపై ఆమె స్పందిస్తూ మండలంలోని కోయన్నపేట గ్రామపంచాయతీలో ఫారంపాండ్ పని రైతు తాడ్డి అప్పలనాయుడు పేరును మంజూరైందన్నారు. దీనికోసం ఉపాధి కూలీలు పనులు చేయడానికి వెళ్లగా అక్కడ నేల గట్టిగా ఉండడం వల్ల ఆ పనిని కూలీలు చేయలేకపోయారని తెలిపారు. దీంతో యంత్రాలతో చేయడంతో పట్టారన్నారు. దీనివల్ల ఆ రైతు తనకు ఆ పని అవసరమని తన సొంత డబ్బులతో యంత్రాలతో పని చేసుకున్నానని ఆ రైతు రాతపూర్వకంగా తెలియజేశారన్నారు. కావున ఆ పనిని సంబంధించి ఎటువంటి చెల్లింపులు జరపలేదని ఆమె పేర్కొన్నారు.

వినియోగదారులు ప్రశ్నించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

నిత్యం కొంటున్న అనేక రకాల సరుకులపై తూనికలు, కొలతలు, నాణ్యతలో అనేక రకాలుగా వినియోగదారులు మోసపోతున్నారని, వారు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని వాటిని నివారించేందుకు జిల్లా వినియోగదారుల హక్కుల రక్షణ సంఘం అధ్యక్షులు పి సూర్యారావు అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం జిల్లా వినియోగదారుల హక్కుల రక్షణ సంఘం పార్వతీపురం వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి రుసుం లేకుండా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి మాన్య రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం వినియోగదారుల సంఘ సమావేశం జరుగుతుందని, వినియోగదారులు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. స్థానిక సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి మాట్లాడుతూ వినియోగదారుల సంఘాల సమాఖ్యను ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మణరావు, వి.సన్యాసినాయుడు, ఎం.ఈశ్వరరావు, వి.శ్రీనివాసరావు, బి.రంగ, తదితరులు పాల్గొన్నారు.ఏ కమిటి రోజు ప్రభాకర్ రావు మాస్టారు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ సన్యాసిరావు

మహిళలు అభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - సీతంపేట

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎ.భాగ్యలక్ష్మి అన్నారు. ఆర్ట్స్ సంస్థ నాబార్డు సహకారంతో ఏర్పాటు చేసిన వన సహజ రైతు ఉత్పద్దాల కంపెనీ మహిళా దినోత్సవ వారోత్సవ కార్యక్రమాలు మండలంలోని కడగండిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే సాధించలేదేమీ లేదున్నారు. మహిళలు స్వయం ఉపాధి, జీవనోపాధి కార్యక్రమాలు, నైపుణ్య అభివృద్ధి శిక్షణ నేర్చుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఆర్ట్స్ సంస్థ గత 30ఏళ్లుగా ఆదివాసీ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్యవతం చేయడంలో ఎంతో విజయం సాధించారని అభినందించారు. ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ మహిళలు సంఘటితంగా ఎదిగి అభివృద్ధి సాధించాలని, వారిలో పట్టుదల, ధైర్యం ఎంతో ఉటుందని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు హేమరిక పవన్, జడ్పిటిసి ప్రతినిధి సవర రాము, సర్పంచులు కుమారి, గజ్జలి సర్పంచ్ సువార్త, ఎంపిటిసి ఎస్,శాంతి మహిళలు, సచివాల సిబ్బంది, ఆర్ట్స్ సిబ్బంది, ఎఫ్‌పిఒ కో-ఆర్డినేటర్ నూకఅనూప్, ఎల్.సందీప్, యూత్ నాయకులు, మా తోట వన సహజ సిఇఒ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

హార్టికల్చర్ అధికారులెక్కడ ? : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో హార్టికల్చర్ అధికారుల పర్యటన కొరవడిందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి అన్నారు. మండలంలోని దేవుకోనలో జీడి మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా ఈ ఏడాది మామిడి తోటలు అక్కడక్కడ తప్ప పూర్తిస్థాయిలో కాపు లేని పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి సందర్భంలో హార్టికల్చర్ అధికారులు కనీసం పట్టించుకోని పరిస్థితి ఉందన్నారు. ఈ ఏడాది మామిడి తోటలు నష్టం జరిగినా రైతులకు అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదుకోవాలని, లేకుంటే మామిడి తోట రైతులందరితో కలిసి భవిష్యత్తులో పెద్ద ఎత్తున కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు.

రేగులగూడలో ఉద్యానవనాలపై శిక్షణ

సీతంపేట: వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రేగులగూడ కాలనీలో వాతావరణ అనుకూల వ్యవసాయం, ఉద్యానవనాలపై రైతులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వెలుగు డైరెక్టర్ సంజీవ్ మాట్లాడుతూ వాతావరణమంటే ఏమిటి, వాతావరణం లో ఏటు వంటి మార్పులు వచ్చాయి, మార్పులు రావటానికి గల కారణాలు, మార్పుల వల్ల ఏ పంటకు నష్టం అన్న విషయాలు వివరించారు. అలాగే శిక్షణలో పులిపుట్టి పంచాయతీ పరిధిలోని రేగులగూడకాలనీ, పాతరేగులగూడకు చెందిన 48 మంది రైతులు పాల్గొన్నారు. శిక్షణలో వెలుగు ప్రతినిధులు సంజీవరావు (డైరెక్టర్), క్రాంతికుమార్ (ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వసంత (ఏరియా కోఆర్డినేటర్) తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - బలిజిపేట

ఈనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ-1 సామల సింహాచలం తెలిపారు. మండలంలోని వంతరాం, బలిజిపేట పరీక్షా కేంద్రాల్లోని ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కెజిబివి కలిపి 382 మంది విద్యార్థులు, అలాగే ప్రైవేటు పాఠశాలల నుంచి 90 మంది, మొత్తం 472 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. బలిజిపేట మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో ఎ,బి రెండు పరీక్ష కేంద్రాలు, వంతరాం జిల్లా పరిషత్‌లో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు మంచినీరు, ఫ్యాన్లు, ఫర్నీచర్ సౌకర్యం కల్పిస్తామన్నారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుందని, 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పక్కాగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిండెంట్స్, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

హాజరుకానున్న 724 మంది విద్యార్థులు

వీరఘట్టం : మండలంలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు స్థానిక జిల్లా పరిషత్తు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల పరీక్ష కేంద్రాలతో పాటు నీలానగరం, బిటివాడ, గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాల్లో 724 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు ఎంఇఒ-2 ఆర్ ఆనందరావు శనివారం తెలిపారు. ఇందుకు సంబంధించి పరీక్ష కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఆరుబయట చదువులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం సచివాలయం పరిధి పెద్దూరులో గల జిటిడబ్ల్యూ పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు ఆరుబయట విద్యను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఈ పాఠశాల భవనం శ్లాబ్ పెచ్చులు అక్కడక్కడ ఊడిపడిపోవడంతో ఏ సమయంలో ఎటువంటి ప్రమాద వార్త వినాల్సి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు భయంతో కాలం గడుపుతున్నారు. అంతేకాకుండా పాఠశాలకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున విద్యార్థులు ఉక్కపోత భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. వర్షాకాలమైతే భవనం పాడే ఉన్నందున వర్షపు నీరు అంతా శ్లాబ్ పైనుంచి కిందకు జారి తరగతి గదలోనే నిల్వ ఉంటుందని, వర్షం అనంతరం నీరు లేకుండా చేసినప్పటికీ చల్లటి గచ్చుపై కూర్చోడానికి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో అధికారులు ఈ గ్రామాన్ని సందర్శించి పాఠశాలను పరిశీలించారని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారు. అయినప్పటికీ వారి నుంచిఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్న స్థాయి అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.


పెద్దూరులో చెట్టు కింద చదువు కొనసాగిస్తున్న విద్యార్థులు

ఘనంగా గోపీనాథ స్వామి విగ్రహాల ఊరేగింపు

ప్రజాశక్తి - భామిని

ఆంధ్రా - ఒడిశా సరిహద్దు వంశధార నది ఒడ్డున మండలంలోని లివిరిలో వెలసిన గోపీనాథ స్వామి డోలోయాత్ర మహోత్సవం ఒడిశా సాంప్రదాయం ప్రకారం శనివారం ప్రారంభమయ్యాయి. ఈ డోలో యాత్రలో భాగంగా గోపీనాథ స్వామి విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని పర్లాకిమిడి మహారాజు గజపతి కుమార్తె కళ్యాణి గజపతి ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. అనంతరం లివిరి పుర వీధుల్లో మేళతాళాలతో గోపినాథ్ స్వామి విగ్రహాలను ఊరేగిస్తూ ఒడిస్సా సాంప్రదాయం ప్రకారం హెూలీ ఉత్సవాలను నిర్వహించారు. హెూలీ అనంతరం వంశధార నదిలో విగ్రహాలను స్నానమాచరించారు. ఈ డోలో యాత్ర ఈనెల 22 వరకు నిర్వహిస్తామని, ఈ యాత్రలో భాగంగా స్వామి వారి దర్శనానికి వచ్చే యాత్రికులకు ప్రతిరోజు ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదాలు ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


గోపీనాథస్వామి ఊరేగింపునకు పోటెత్తిన యాత్రికులు

15 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సర్కిల్ పరిధిలో గల టిక్కబాయిలో శనివారం ఎక్సైజ్ సిబ్బంది జరిపిన దాడుల్లో 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు మండల కేంద్రంలో గల రెల్లివీధికి చెందిన అప్పారావు నుంచి పది లీటర్ల నాటుసారా, టిక్కబాయికి చెందిన పి.ప్రసాద్ నుండి 5లీటర్లు నాటు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నాటు సారా తయారు చేసినా, అమ్మినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై జె.రాజశేఖర్ , సిబ్బంది పాల్గొన్నారు.


సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి పాడి రైతు పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి కె.శైలజ అన్నారు. మండలంలోని బియ్యాలవలస పంచాయతీ సూర్య నగరంలోశనివారం పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టేకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవికాలం నేపథ్యంలో పశువులకు వడదెబ్బ తగిలి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి పాడి రైతులకు అవగాహన కల్పించారు. గాలికుంటు, బ్రూసేల్లోసిస్ నిరోధక టీకాలు ప్రతి గ్రామంలో వేస్తున్నామని, కావున పాడి రైతుల వారి పశువులకు టీకాలు వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.